క్లుప్తంగా

సమ్మె వాయిదా



సమ్మె విరమణ పత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో ఎవరెస్టు కంపెనీ యాజమాన్యం పరిధిలో పని చేస్తున్న కార్మికుల నిరవధిక సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ కార్యాలయంలో ఎవరెస్టు కంపెనీ యాజమాన్యంతో జేఏసీ నాయకులు జరిపిన చర్చల్లో పురోగతి ఉండడంతో సమ్మె విరమణ పత్రాన్ని కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. వారు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం అక్టోబర్ 4లోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. యాజమాన్యం హెచ్ఆర్ సందీప్, ఇంజనీర్ నిఖిల్, లక్ష్మణ్, నాయకులు బోగె ఉపేందర్, దివాకర్, లోకేష్, చిరంజీవి, రాజేందర్, ప్రేమ్‌దాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం



ఎస్సై చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: నూతన ఎస్సైగా ఇటీవల బదిలీపై వచ్చిన డొలకాసి చంద్రశేఖర్‌ను శుక్రవారం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు సైతం ఎస్సైని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, మదునయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: అన్ని అర్హతలు ఉండి వివిధ కారణాలతో రుణమాఫీ పెండింగ్‌లో ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో ఖాదర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఏవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హతలు ఉండి లోన్ అకౌంట్ క్లోజ్ చేయడం, ఒకే ఆధార్‌పై ఇతరుల పేర్లు ఉండడం వంటి కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ జరగలేదని, అలాంటి వారు పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు అకౌంట్ పత్రాలతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు చిరంజీవి, రెహమాన్, రాము రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లో అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్లను శుక్రవారం కాగజ్‌నగర్ ఫొటో అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వర్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొనడమే కాకుండా ఆధునిక సాంకేతికతో కూడిన కెమెరాలు, విడిభాగాలు ప్రత్యేక ఆఫర్లతో విక్రయిస్తారన్నారు.

జిల్లాలో 61.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్: జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. శుక్రవారం జిల్లాలో 61.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కౌటాలలో 108.4 మి.మీలు, జైనూర్‌లో 68.2 మి.మీలు, సిర్పూర్(యూ) 28, లింగాపూర్ 10.2, తిర్యాణి 15.4, రెబ్బెన 95.4, ఆసిఫాబాద్ 80.2, కెరమెరి 44.6, వాంకిడి 49.4, కాగజ్‌నగర్ 61.2, సిర్పూర్(టి) 80.4, చింతలమానెపల్లి 104.8, బెజ్జూర్ 63, పెంచికల్‌పేట్ 54.6, దహెగాంలో 52.2 మిల్లీమీటర్లుగా నమోదైంది.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	80
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	80
పాలకూర	40
సోరకాయ	100
చిక్కుడు కాయ	140
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

రోడ్డుపై కరెంట్ పోల్స్

- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- తొలగించాలని డిమాండ్



స్థానిక డొనల్ ప్రాంతంలో..



దుబ్బగూడ సమీపంలో సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిపై విద్యుత్ స్తంభం

సిర్పూర్(టి): మండలంలోని ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకొని, రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనదారులకు శాపంగా మారింది. ఏళ్లుగా రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో ప్రధాన రహదారుల గుండా ప్రయాణాలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయల్లో ఆదమరిస్తే రోడ్డు ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి ఉంది.

వాహనదారులకు తిప్పలు..

సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ నుంచి డొనల్ వెళ్లే ప్రధాన రహదారిలో వెంకటేశ్వరాలయం ఎదుట ఉన్న విద్యుత్తు స్తంభం రోడ్డుకు ఆనుకొని ఉంది. కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినా విద్యుత్తు స్తంభాన్ని మాత్రం తొలగించలేదు. ఈ రహదారి గుండా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ ప్రజలతో పాటు సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలోని దుబ్బగూడ కాలనీ సమీపంలో రోడ్డుకు ఆనుకొని విద్యుత్తు స్తంభం ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్ర పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. రాత్రి సమయాల్లో విద్యుత్ స్తంభాల సమీపంలో ఇరువైపులా వాహనాలు ఒకేసారి వస్తే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని మండలవాసులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు



మండలంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లకు ఆనుకొని విద్యుత్తు స్తంభాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో ఇరువైపులా ఒకేసారి వాహనాలు వస్తే తిప్పలు తప్పడం లేదు. వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలి.

– రాపర్తి శ్రీకాంత్, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వినేశ్, సిర్పూర్(టి)

రసాభాసగా సర్వసభ్య సమావేశం



సభ్యులతో వాగ్వాదం చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియా

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎంపీపీ జాజుమొగ్గ సుజాత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. వైద్యశాఖ అధికారులు తమ నివేదికలో 6వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని సభ దృష్టికి తీసుకురాగా మండల కోఆప్షన్ సభ్యుడు సాజిత్, సర్పంచ్‌లు రాజన్న, సుధాకర్, చంద్రమౌళిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహించి తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని మండిపడ్డారు. హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియా జోక్యం చేసుకొని ప్రజాప్రతినిధులతో పరుషంగా మాట్లాడడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. అనంతరం ఎంపీపీ సుజాత మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశాలకు హాజరు కాని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, ఏవో రాజులనాయుడు, వైస్‌ఎంపీపీ కమల, ఎంఈవో రమేశ్‌బాబు, ఏఈలు మనోహర్, అంజల్‌కుమార్, ఏపీవో కోనయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లారీ యజమానుల సమ్మె



మద్దతు తెలుపుతున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం మిల్లు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఎస్పీఎం నెగోషియేషన్ కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం తమ వైఖరి మార్చుకొని స్థానికులకు సరైన హక్కులు కల్పించి పారిశ్రామిక శాంతి నెలకొల్పేలా వ్యవహరించాలన్నారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగిన సమావేశాల్లో కలెక్టర్ మిల్లు యాజమాన్యాన్ని మందలించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మిల్లు యాజమాన్యం తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెరిగిన వేతనాన్ని వెంటనే ఏరియర్స్‌తో సహా చెల్లించాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మి, పద్మ, సుమిత్ర, పార్వతి, సరోజన, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్: ఐసీడీఎస్ పరిధిలో పని చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ఉన్నతాధికారులు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా నడుస్తున్నాయనడం హాస్యాస్పదమన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శకూర్ వనిత, పద్మ, సరళ, అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తుండగా, ప్రభుత్వం వారిని రెచ్చగొట్టి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

తాళాలు పగలగొడితే సమ్మె ఆగుతుందా..?

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాలకు ఉన్న తాళాలు పగలగొడితే సమ్మె ఆగుతుందా..? అని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనంద్ ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనసూయ, బొజ్జుబాయి, లింగుబాయి, అనిత, ప్రమీల, తిరువన, గంగుబాయి, రేణుక, జైనాబాయి ఉన్నారు.

సరుకుల వాహనాలు అడ్డుకున్న అంగన్‌వాడీలు



కార్గో బస్సును అడ్డుకున్న అంగన్‌వాడీలు

కౌటాల: సమస్యల పరిష్కారానికి తాము సమ్మెలో ఉండగా తమ సంతకాలు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు ఎలా సరఫరా చేస్తారని శుక్రవారం కౌటాలలో అంగన్‌వాడీ గుడ్ల ఆటో, పౌష్టికాహార సరుకులు తీసుకువచ్చే కార్గో బస్సును అడ్డుకుని ఆందోళన చేశారు. వాహనం ఎదుట ఐదుగంటల పాటు బైఠాయించారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాత్రి వేళ ఎందుకు సరుకులు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆందోళన వద్దకు కౌటాల సీఐ సాదిక్‌పాషా, సీడీపీవో విజయలక్ష్మి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో పూర్ణిమ, ఎస్సై మధుకర్, ఏపీఎం వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరా చేరుకుని వారితో మాట్లాడారు. న్యాయంగా సమ్మె చేసుకోవాలని, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించవద్దని సూచించారు. అంగన్‌వాడీల ఆందోళనకు సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమాచారి, మోరేశ్వర్, నాగేశ్ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు జీజాబాయి, శ్యామల, ఇందు, సుందరి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ఆసిఫాబాద్‌రూరల్: పశు సంతతిని మరింత పెంచాలని జిల్లా పశువైద్యాధికారి సురేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా పశువులలో పునరుత్పత్తి ఫలదీకరణపై రైతులకు అవగాహన కల్పించి వ్యాధి నిరోధక శక్తిని పెంచే టీకాలను పశువులకు, గొర్రెలు, మేకలకు వేసి మందులు అందించారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల అసోసియేషన్ డాక్టర్ మాధవ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణ కుమారి, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి మురళికృష్ణ, పశువైద్యులు నాగరాజు, శివ కోరుట్ల తదితరులు పాల్గొన్నారు.

రహదారి బాగు చేయరూ..!



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారి అధ్వానంగా మారింది. దారిపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. బస్టాండ్‌కు రెండోవైపు ఉన్న రహదారి పూర్తిగా చెడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు ప్రధాన రహదారి గుండా వెళ్లాలంటే దూర భారం పెరుగుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిపో అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



దహెగాం: బీబ్రాలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

దహెగాం: మండలంలో కొలువుదీరిన గణనాథులకు భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బీబ్రా గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. వినాయకుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మహిళలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వద్ద అన్నదానం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం, డొనల్ ప్రాంతం, మండలంలోని ఇతర గ్రామాల్లో గల గణేశ్ మండపాల వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మిగణపతి మండపం వద్ద పూజలు..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో వినాయక మండపాల వద్ద నిత్యం అన్నదానం, విశిష్ట పూజలతో పండుగ వాతావరణం నెలకొంది. నవరాత్రుల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం పట్టణంలోని కుమురంభీం చౌక్, జ్యోతి ట్రాన్స్‌పోర్టు వద్ద శ్రీ లక్ష్మి గణేశ్ మండపం వద్ద అర్చకులు నిమ్మకంటి మహేష్‌శర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన ప్రసాదవితరణ చేపట్టారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం కుంకుమ పూజ, అమ్మవారి పూజహారతి నిర్వహించారు. భగత్‌సింగ్ రోడ్డు గణనాథుని వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీష్, ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ కమిటీ మహిళా అధ్యక్షురాలు మామిడాల మమత పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు వెంకన్న, వేణు, ప్రమోద్, ప్రదీప్, గంధం వేణు, మురళీకృష్ణ, దిలీప్ టాటియా, సురేశ్ టాటియా, సంతోశ్, విక్రమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశుని పాటలతో ఆయా గ్రామాల్లోని మండపాలు మారుమోగాయి. గణేశ్ మండపాల వద్ద నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దీపాలంకరణ పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని బాపూనగర్ కాలనీలో గల శారదా గణేశ్ మండపం వద్ద శుక్రవారం దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. పోటీలలో దంపతులు ఆసక్తిగా పాల్గొనగా ముగ్గురిని విజేతలుగా నిర్ణయించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంగ, అశ్విన్, వివేక్, శ్రీనివాస్, మహేందర్, సుగుణాకర్, శ్రీనివాస్‌గౌడ్, రజని, దేవేంద్ర, గణపురం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు జీఎం పూజలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీ ఆవరణలోని దుర్గామాత ఆలయంలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యను శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అధికారులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విఘ్నేశ్వరుడికి నిర్వహించిన కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జీఎంను శాలువాతో సన్మానించారు. అనంతరం సీహెచ్‌పీ ఉద్యోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, డీవైసీఎంవో ఆర్.శౌరీ, డీజీఎం సీహెచ్‌పీ భీంరావ్ జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, ఐటీ మేనేజర్ నారాయణ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో..



రెబ్బెన: దర్శించుకుంటున్న సింగరేణి అధికారులు

లంబోదరుడి లడ్డూ మాయం!

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామపంచాయతీలోని గొర్రెగూడలో గల ఓం శ్రీసాయి గణేశ్ మండలి వినాయక విగ్రహం వద్ద గల లడ్డూ శుక్రవారం మాయమైంది. నాలుగు రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూ మాయమవడంతో అందరు ఆశ్చర్యానికి గురయ్యారు. గురువారం రాత్రి గణేశ్ మండలి కమిటీ సభ్యులు మండపం వద్దే నిద్రించగా తెల్లవారుజామున లేచి చూసేసరికి లడ్డూ లేకపోవడంతో విస్మయానికి గురయ్యారు.

రేపు పీఆర్టీయూటీఎస్ జిల్లా సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లి గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు పీఆర్టీయూటీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రావు, కార్యదర్శి ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్‌తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు హాజరవుతారని వెల్లడించారు. ఉపాధ్యాయుల సమస్యలు, ఇతర అంశాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా బాల వినాయకుడి నిమజ్జనం



దహెగాం: నిమజ్జన యాత్రలో పాల్గొన్న భక్తులు



ఆసిఫాబాద్‌అర్బన్: టీఆర్‌నగర్‌లో..

దహెగాం: మండల కేంద్రంలోని బుడిపెల్లివాడ, చప్పిడవాడల్లో నవరాత్రుల్లో కొలువు దీరిన బాల వినాయకులను శుక్రవారం నిమజ్జనం చేశారు. వినాయకులను ట్రాక్టర్‌లలో వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. బాలలు, యువకులు నృత్యాలు చేశారు. గ్రామ సమీపంలోని వాగుల వద్ద నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో బాలాగణేశ్ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి నిమజ్జనాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాహనాన్ని అలంకరణతో ఏర్పాటు చేసి పట్టణ వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం పెద్దవాగులో నిమజ్జనం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం గోలేటి, తక్కళ్లపల్లి గ్రామాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు సేవలు, అమలు చేస్తున్న పథకాలపై కళాకారులు మ్యాజిక్ షో, పాటల ద్వారా అవగాహన కల్పించారు. బ్రాంచి మేనేజర్ విశ్వప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, క్యాషియర్ సురేశ్, బ్రాంచి సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.